క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి


లవనీత్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదివిన బెడిక లవనీత్ కుమార్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రొయ్యూర్ గ్రామానికి చెందిన బెడిక సమ్మయ్య మృతి చెందగా తల్లి పద్మ లవనీత్‌ను కష్టపడి చదివించింది. లవనీత్ కుమార్ పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలవడంతో పాటు ట్రిబుల్ ఐటీలో సీటు సాధించాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థి లవనీత్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

విధుల్లో చేరిన ఎస్సై



ఏటూరునాగారం: గత కొన్ని రోజులుగా సెలవుపై వెళ్లిన ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ సోమవారం విధుల్లో చేశారు. మే 21వ తేదీ నుంచి వ్యక్తిగత కారుణాలతో సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో తాడ్వాయి రెండో ఎస్సై శ్రావణ్‌కుమార్ ఏటూరునాగారం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

అరెస్టులకు భయపడం


అరెస్టు అయిన నాయకులు

ములుగు రూరల్: పేదల పక్షాన పోరాటం చేస్తున్న తమను అక్రమ అరెస్టులు చేస్తే భయపడేది లేదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అమ్జద్‌పాషా అన్నారు. మండలంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపడుతుండగా సీపీఎం నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరియైనది కాదన్నారు. ముందస్తు అరెస్టులకు నిరసనగా వారు పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలిపారు. ప్రభుత్వం జీఓ 58 ఆధారంగా నిరుపేదలు ఇళ్లు నిర్మించుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గఫూర్, గుండబోయిన రవిగౌడ్, కొర్ర రాజు, బోడ రమేష్, మామిడి నటరాజ్, రాములు పాల్గొన్నారు.

జీసీసీ రిటైర్డ్ సేల్స్‌మెన్ మృతి


వీరయ్య (ఫైల్)

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన జీసీసీ రిటైర్డ్ సేల్స్‌మెన్, మాజీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ నాయకులు, వీసం వీరయ్య అనారోగ్యంతో సోమవారం తన స్వగృహంతో తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా వీరయ్య కాన్సర్‌తో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న పలు సంఘాల నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహిళా కన్వీనర్‌గా సుధారాణి

వాజేడు: బీసీ సంక్షేమ సంఘం మండల మహిళా కన్వీనర్‌గా సూత్రపు సుధారాణిని నియమించినట్లు జిల్లా కన్వీనర్ మురళీ సోమవారం వెల్లడించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల మహిళా కన్వీనర్‌గా సుధారాణి, యూత్ కన్వీనర్‌గా బత్త సురేష్, ఏడ్జర్లపల్లి గ్రామ కమిటీ కన్వీనర్‌గా రామెళ్ల మహేష్‌లను నియమించినట్లు వెల్లడించారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు

చిట్యాల: కులం పేరుతో దుర్భాషలాడుతూ ఇంటికొచ్చి భయభ్రాంతులకు గురి చేసి కొట్టిన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ. షాఖాన్ సోమవారం తెలిపారు. బావుసింగ్‌పల్లికి చెందిన అజ్మీరా జవహర్‌లాల్ డబ్బులు ఇవ్వడం లేదనే నెపంతో వెంచరామి గ్రామానికి చెందిన కాసు సురేష్, కాసు శిరీష జవహర్‌లాల్ ఇంటికి వెళ్లి కులం పేరుతో తిడుతూ వారిని కొట్టారని తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టై, బెల్టుల పంపిణీ

భూపాలపల్లి రూరల్: మండలంలోని కొంపెల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం వరంగల్‌కు చెందిన క్రిడాయి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులతో పాటు, షూస్, స్కూల్ బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో క్రిడాయి సంస్థ ప్రతినిధి చందుపట్ల సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పైడపు నాయుడు, అమరేందర్‌రెడ్డి, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు పొందిన భక్తులు
- ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు


ఏటూరునాగారం: భక్తులకు హారతి అందజేస్తున్న అర్చకుడు సుదర్శనస్వామి

ఏటూరునాగారం: గురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని షిర్డిసాయి బాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహానికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, పుష్పార్చన, అష్టోత్ర పూజలను అర్చకులు హరిదాస్య సుదర్శనస్వామి జరిపించారు. స్థానిక సీఐ మండల రాజు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ నిర్వాహకులు సీఐని ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఏడాది పాటు ప్రతీ గురువారం మినీ అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు విరాళాలు ఇచ్చిన మెర్గు సత్యం, నూతి రమేష్, మైనర్‌బాబు, రాంబాబు, మడుగురి ప్రసాద్ తదితరులన ఆలయ కమిటీ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మహన్నదానం సందర్భంగా స్వామివారికి టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ ప్రసాదాన్ని సమర్పించారు. అన్నదాన కార్యక్రమానికి సుమారు రెండువేల మంది హాజరైనట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాత యాదగిరి, బచ్చు సతీష్, శ్రీనివాస్, సుభాష్, భరత్, శంకర్, చెన్న ముత్తయ్య, ఆకుల వెంకట్రాంనర్సయ్య, అల్లి శ్రీనివాస్, అటిక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని కమలాపురంలో గల షిరిడి సాయిబాబా దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 5.30 గంటల నుంచి అర్చకులు రామసుబ్బారావు శర్మ, వర్మలు ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీనర్సింహస్వామి భజన మండలి సభ్యులు సాయికీర్తనలు ఆలపించారు. వేడుకలకు కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం సాయిపల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించి కోలాట బృందాలు గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మేళతాలం బహూకరణ

మంగపేట: మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖర స్వామి దేవస్థానంలోని సాయిబాబా ఆలయానికి మండల కేంద్రానికి చెందిన తునికి వీరరాఘవచారి, ధనలక్ష్మి దంపతులు మేళతాలం పరికరాన్ని దేవస్థానం చైర్మన్ మైల నరేష్‌రెడ్డి సమక్షంలో సోమవారం బహూకరించారు. ఆలయానికి తమంతు సహకారం అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వీరరాఘవచారి దంపతుల పేరిట ఆలయ పూజారి విస్సావఝ్జుల నరేష్ శర్మ ప్రత్యేక పూజలు జరిపించి ఆశీర్వదించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొమరగిరి సాంమ్రాజ్యం, కేశవరావు, ఏపీజీవీబీ రైటైర్డ్ మేనేజర్ మణివర్మ, పద్మ, శ్రీనివాస్, రావుల శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంతో పాటు పెట్రోల్ బంక్ సమీపంలో గల సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. అనంతరం వేల్పూరి శ్రీనివాస్ దంపతులు మహాఅన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు వేల్పూరి లక్ష్మీనారాయణ, కోట మల్లిఖార్జున్‌రావు, కలకోట సంతోష్, కొలిపాక రాజేష్, ముడుంబా శ్రీనివాస్, జాగర శాంతమూర్తి, వేల్పూరి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మంగపేట: మేళతాలం పరికరాన్ని బహూకరిస్తున్న దాతలు


వెంకటాపురం(కె): పూజలు చేస్తున్న భక్తులు


ఏటూరునాగారం: పంచామృత అభిషేకం చేస్తున్న ఆలయ చైర్మన్ మెర్గు సత్యం

పోడు రైతులకు పట్టాల పంపిణీ


ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేస్తున్న తహసీల్దార్

వాజేడు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన పోడు రైతులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను తహసీల్దార్ సయ్యద్ సర్వర్, జెడ్పీటీసీ పుష్పలతలు అందించారు. సోమవారం మేడారం పర్యటనకు రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రైతులకు పట్టాలు పొందారు. మండలంలోని చీకుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన 14 మంది పోడు రైతులకు తహసీల్దార్ సయ్యద్ సర్వర్, జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, సర్పంచ్ కోరం సమ్మక్క, ఆర్ఐ కాట రాజు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందించారు. మండలంలోని మిగతా గిరిజన రైతులకు త్వరలోనే పట్టాలు అందిస్తామని అన్నారు. మండలంలో మొత్తం 119 మంది గిరిజన పోడు రైతులు పట్టాలకు దరఖాస్తులు చేసుకోగా అందులో 14 మందికి పట్టాలు అందించినట్లు వారు తెలిపారు. పోడు రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కేంద్ర పథకాలు ఇంటింటికీ చేరవేయాలి

- తమిళనాడు రాష్ట్రం మైలదుతురై జిల్లా ఉపాధ్యక్షుడు సెంథిల్ కుమార్


మహాముత్తారం : పథకాలను వివరిస్తూ..


భూపాలపల్లి రూరల్ : ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికి చేరవేయాలని తమిళనాడు రాష్ట్రం మైలదుతురై జిల్లా ఉపాధ్యక్షుడు ముట్టం సెంథిల్ కుమార్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం పార్టీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షులు సామల మధుసూదన్‌రెడ్డి రాజీవ్‌నగర్ కాలనీ కృష్ణకాలనీ క్వా టర్స్, భూపాలపల్లి మెయిన్ రోడ్, కాసింపల్లి, శక్తి కేంద్రం బూత్ కమిటీల సమావేశాలు నిర్వహించా రు. కార్యక్రమాలకు సెంథిల్ కుమార్ ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణలో అధి కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేకమైన సంక్షేమ పథకాలు తీసుకువచ్చి పేద మధ్యతరగతి వా ళ్లకు నిరుపేదలకు బాసటగా నిలిస్తుందన్నారు. మ ధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కీర్తిరెడ్డిని గెలిపించే విధంగా నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల శ్యామ్, తుమ్మేటి రాంరెడ్డి, కోరే సుధాకర్, శివరాత్రి వేణు ,శ్రీనివాస్ బూర పద్మ, చల్ల అనిల్, తుటి రాజు, బండి వెంకటేష్ , స్వప్న, పుష్ప, సరోజన పాల్గొన్నారు.

మహాముత్తారం: మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిమ్మగూడెం, రెడ్డిపల్లి, కనుకునూర్, సింగంపల్లి, యత్నారం, బోర్లగూడెం గ్రామాల్లో బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై సోమవారం ఆయా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్‌కుమార్, నాయకులు పూర్ణచందర్, శ్రీకాంత్, హర్ష, ఠాకూర్, మానేటి శేఖర్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కైలాస రథం బహూకరణ

మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేటకు చెందిన మేడిద ఆదిరెడ్డి తన తండ్రి గట్టయ్య జ్ఞాపకార్థం తన సొంత ఖర్చులతో కై లాస రథాన్ని చేయించారు. రథంతో పాటు సంబంధిత కాగితాలను సోమవారం సర్పంచ్ కొడారి సునీత రమేష్ యాదవ్‌కు అందజేశారు. గ్రామ పంచాయతీకి కైలాస రథాన్ని బహుకరించడంతో సర్పంచ్ ఆదిరెడ్డిని అభినందించారు.

చేతివృత్తులతో లాభాలు పొందాలి


మాట్లాడుతున్న అధికారులు

వాజేడు: చేతివృత్తి చేసుకుంటున్న వారు లాభాలు పొందే విధంగా మెలుకువలు పాటించాలని డీపీఎం సతీష్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నాగవంశీ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కుమ్మర కులస్తులకు చెరుకూరులో గల రైతువేదికలో సోమవారం ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. మట్టితో పాత్రలను ఎలా తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమం అంతనం అర్హత కలిగిన వారికి జిల్లా కలెక్టర్ పనిముట్లను అందజేస్తారని వారు వెల్లడించారు. మూడు రోజుల పాటు కొనసాగే శిక్షణ కార్యక్రమంలో ప్రతీ కుమ్మర బిడ్డ భాగస్వామ్యం కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్ కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు సత్తిబాబు, కార్యదర్శి దర్శన్‌బాబు, మాస్టర్ ట్రైనర్ రమేష్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శ్రీపతిబాబు

మహదేవపూర్ : మంథని మున్సిపాలిటీ బొక్కల వాగు వంతెనపై మంగళవారం దొడ్డి కొంరయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని సర్పంచ్ శ్రీపతిబాపు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం విగ్రహావిష్కరణ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత, భూపాలపల్లి జెడ్పీ చైర్పర్సన్ జక్కు శ్రీహర్షిని పాల్గొననున్నట్లు తెలిపారు. కాళేశ్వర దేవాలయం చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, గీతబాయి, యూత్ అధ్యక్షుడు అలీంఖాన్, ప్రభాకర్, పాల్గొన్నారు.

కమ్ముకొచ్చిన కారుమబ్బులు



వాజేడు: ఆకాశంలో ఒక్క సారిగా మబ్బులు కమ్మి మేఘావృతమైంది. దీంతో ఆకాశం చీకటిగా మారి వాతావరణం ఆహ్లాద కరంగా కనిపించింది. వర్షం సూచనలు కనిపించడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో మబ్బులు కమ్ముకొస్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి


అక్షరాలు నేర్పిస్తున్న ఎంపీపీ వినోద, ఎంఈఓ

చిట్యాల : అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను విద్యతో పాటు ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి అన్నారు. చల్లగరిగ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ హజరై మాట్లాడుతూ రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్ల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తే అక్షరాలతో పాటు ఆటపాటలు, క్రమశిక్షణ అలవర్చుతుందన్నారు. కేంద్రంలోని 15 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి ఐదుగురికి అన్నప్రాసన చేయించారు. బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ రఘుపతి, ప్రధానోపాధ్యాయులు గోవిందు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మహేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, టీచర్స్ చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

'సికిల్‌సెల్' వ్యాధి పై నిర్లక్ష్యం వద్దు..


వెంకటాపురం(ఎం): విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న సిబ్బంది


మంగపేట: విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది


వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్


వాజేడు: అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది


వెంకటాపురం(కె): రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వెంకటాపురం(ఎం): సికిల్ సెల్ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించొద్దని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలు రక్తహీనత బారిన పడకుండా పరీక్షలు చేసుకోవాలని కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం సికిల్ సెల్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సర్పంచ్ మేడబోయిన అశోక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు నల్లగుంట, పాలంపేట గ్రామాల్లోని పాఠశాలల్లో 40 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా అందరికి నెగటివ్ వచ్చిందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా ఎస్టీ ట్రైబల్ ఏరియా విద్యార్థులకు పరీక్షలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. పరీక్షలో వ్యాధి నిర్ధారణ జరిగితే నమూనాలను తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌కు పంపిస్తామన్నారు. రోగుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. వివిధ పాఠశాలల్లో మరో ఐదు రోజుల పాటు ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్యులు అనిత, చందన, సీహెచ్ఓ సదానందం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జనగాం బాబురావు, పెండ్యాల సలేంద్రం, ఎఎన్ఎంలు అనురాధ, స్వప్న, స్వర్ణలత, కనుకలక్ష్మి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మంగపేటలో..

మంగపేట: విద్యార్థుల ఆరోగ్యాన్ని హరించే సికిల్ సెల్ వ్యాధినిపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి యమున అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, కోమటిపల్లి ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 18 ఎళ్లలోపు ఉన్న 132 మంది విద్యార్థినిలకు రక్త నమూనాలు సేకరించారు. అదే విధంగా చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు చేకరించారు. వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించడం ద్వారా ఆరోగ్య సమస్యల నుంచి రక్షించవచ్చన్నారు. రక్త పరీక్షలు నిర్వహించిన విద్యార్థుల్లో ఎవరికి కూడా సికిల్‌సెల్ వ్యాధి లక్షణాలు లేవని వెల్లడించారు. వైద్య సిబ్బంది శైలజ, హెచ్‌వి ముత్తమ్మ, మంగపేట పీహెచ్‌సీ సీహెచ్ఓ సత్యవతి, హెచ్ఈఓ అక్బర్ అబ్బాస్, హెచ్‌వి గంగ, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: సికిల్ సెల్ వ్యాధి నిర్మూళనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కొయ్యూర్ పీహెచ్‌సీ డాక్టర్ సుమలత అన్నారు. విద్యార్థులతో పాటు ప్రతీ ఒక్కరు పరీక్షలు చేసుకోవాలని కోరారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం సికిల్‌సెల్ పరీక్షలు చేశారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, విద్యాసంస్థల్లో పరీక్షలు చేస్తున్నామని, ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు మౌనిక, చాముండేశ్వరి, సుచిరిత, అనూష, సీహెచ్ఓ శారద, హెచ్ఎస్ కమల, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు రేవతి, హెచ్‌డబ్ల్యూఓ శ్రీలత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): సికిల్‌సెల్ వ్యాధి నిర్మూళనకు మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థినుల నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు ఎదిర వైద్యాధికారిణి భవ్యశ్రీ సోమవారం తెలిపారు. అలుబాక జెడ్పీహెచ్ఎస్, వెంకటాపురం జెడ్పీహెచ్ఎస్, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన కల్పించామన్నారు. 213 మంది విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేశామని ఎవరికీ పాజిటీవ్ రాలేదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వాజేడులో..

వాజేడు: సికిల్‌సెల్ అన్నీమియా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్యాధికారి మహేందర్, ఎంఈవో వెంకటేశ్వరావు అన్నారు. జాతీయ సికిల్‌సెల్ అన్నీమియా నిర్మూళన దినోత్సవం సందర్భంగా సోమవారం వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ప్రతీ సోమ, మంగళ, గురు, శుక్రవారాల్లో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

గురుపౌర్ణమి వేడుకలు


దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

భూపాలపల్లి అర్బన్ : గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు ప్రత్యేక హోమం నిర్వహించి ప్రారంభించారు. భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్ర పల్లకిసేవ చేపట్టగా భక్తులు పాల్గొన్నారు.